# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 31-12-2025 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.
- ❖ రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటయిన జిల్లా కేంద్రాల నుండి పరిపాలనా కార్యకలాపాలు నేటి నుండి ప్రారంభమయ్యాయి.
- ❖ రాష్ట్రంలోని గ్రామాలకు ఇకపై నిరంతరాయంగా త్రీ ఫేజ్ విద్యుత్ సరఫరా జరగనుందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ చెప్పారు.
- ❖ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం వీబీ-జీ-రామ్-జీ చట్టాన్ని తీసుకువచ్చిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ అన్నారు.

=====================

ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం ఈరోజు రాష్ట్ర వ్యాప్తంగా జరిగింది. రేపు చేపట్టాల్సిన పింఛన్ల పంపిణీ కార్యక్రమం నూతన సంవత్సరం సందర్భంగా ఒక రోజు ముందుగానే ఇళ్ల వద్దకే నగదు అందించేలా ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అందులో భాగంగా ప్రజా ప్రతినిధులు, అధికారులు ఈ ఫించన్ల పంపిణీ కార్యక్రమంలో పెద్ద ఎత్తున నేటి ఉదయం నుంచే పాల్గొన్నారు. మొత్తం 63.12 లక్షల మందికి పింఛన్ అందించడానికి 2 వేల 743 కోట్ల రూపాయలను ప్రభుత్వం విడుదల చేసిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా తెలిపారు. పేదల జీవితాలకు ఆర్థిక భరోసా కల్పించే పింఛన్ల పంపిణీ కార్యక్రమం తమ ప్రభుత్వానికి అత్యంత సంతృప్తిని కలిగించే సంక్షేమ కార్యక్రమం అని తెలియజేస్తూ... రాష్ట్ర ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

=====================

రాష్ట్ర మంత్రివర్గంలో ఇటీవల ఆమోదం పొందిన కొత్త జిల్లాల ఏర్పాటు ప్రక్రియ పూర్తయ్యింది. ఆయా జిల్లా కేంద్రాల నుండి పరిపాలన ఈరోజు నుండి ప్రారంభమయ్యింది. అందులో భాగంగా రంపచోడవరం కేంద్రంగా పోలవరం జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని ఇన్‌ఛార్జి కలెక్టర్ గా నియమితులైన ఏ ఎస్ దినేష్ కుమార్ ప్రారంభించారు. అదే విధంగా పోలవరం జిల్లా

ఇన్‌ఛార్జ్ ఎస్పీగా అమిత్ బర్ధర్ బాధ్యతలు స్వీకరించారు. ఇక మార్కాపురం జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ గా పి. రాజాబాబు, ఎస్పీగా వి. హర్షవర్ధన రాజు భాధ్యతలు చేపట్టారు. 5 కొత్త రెవెన్యూ డివిజన్లు కూడా నేటి నుంచి ప్రారంభమయ్యాయి.

======================

అభివృద్ధి, సంక్షేమాలే లక్ష్యంగా ఎన్డీయే కూటమి ప్రభుత్వం పని చేస్తోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి అన్నారు. నూతనంగా ఏర్పాటైన మార్కాపురం జిల్లా ఇన్ ఛార్జ్ కలెక్టర్ గా పి.రాజాబాబు బాధ్యతల స్వీకరణ కార్యక్రమంలో మంత్రి ఈరోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి విలేకరులతో మాట్లాడుతూ.. ఇచ్చిన మాట మేరకు రాష్ట్రంలో రెండు కొత్త జిల్లాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. నూతనంగా ఏర్పాటు చేసిన మార్కాపురం జిల్లాను పీఎం సర్వోదయ యోజన ద్వారా అభివృద్ధి చేస్తామన్నారు. వెలిగొండ ప్రాజెక్ట్ ను పూర్తి చేస్తామని, నల్లమల సాగర్ ద్వారా ఉమ్మడి ప్రకాశం జిల్లా వాసులకు తాగు, సాగు నీరు అందిస్తామని చెప్పారు.

(వాయిస్ 28 సెకన్లు)

======================

రాష్టంలోని గ్రామాలకు ఇకపై నిరంతరాయంగా త్రీ ఫేజ్ విద్యుత్ సరఫరా అందనుంది. దీని కోసం పునరుద్ధరించబడిన పంపిణీ రంగం (ఆర్డీఎస్ఎస్) పథకం కింద ఫీడర్ల విభజన, కొత్త ఫీడర్ల ఏర్పాటు పనులను డిస్కంలు చేపట్టాయని, దీంతో సాంకేతిక నష్టాలు తగ్గి, విద్యుత్ కొనుగోలు వ్యయం కూడా తగ్గుతుందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ తెలిపారు. విజయవాడలో ఈరోజు జరిగిన ఏపీసీపీడీసీఎల్ 6వ వార్షికోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తిలో రాష్ట్రాన్ని 2030 నాటికి దేశంలోనే అగ్రగామిగా నిలపాలనే లక్ష్యంతో పని చేస్తున్నట్లు తెలిపారు. క్లీన్ ఎనర్జీ, గ్రీన్ ఎనర్జీ, పవన విద్యుత్, సోలార్ విద్యుత్ లను రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని విజయానంద్ తెలిపారు.

విరామం

======================

'సంస్కరణల సంవత్సరం'గా నిలిచిన 2025లో భారత్ ప్రపంచ ఉత్పాదక కేంద్రంగా పరిణమించిన ప్రయాణంపై ఆకాశవాణి అందిస్తున్న ఒక ప్రత్యేక వార్తా కథనం...

పారిశ్రామిక, ఆర్థిక ప్రగతిలో 7.8 శాతం అంచనా వృద్ధి రేటుతో 2025లో భారత్ ఒక నిర్ణయాత్మక మలుపుకు చేరుకుంది. ఈ సంవత్సరం నోయిడాలో భారతదేశపు మొట్టమొదటి మొబైల్ స్కీన్ టెంపర్డ్-గ్లాస్ తయారీ కర్మాగారం ప్రారంభమైంది. అదేవిధంగా ఇంధన రంగంలో, దేశం 100 గిగా వాట్ల సౌర ఉత్పాదక సామర్థ్యాన్ని సాధించడం ద్వారా ఒక ప్రధాన మైలురాయిని చేరుకుంది. జాతీయ నిరుద్యోగ రేటు కూడా 5 శాతానికి తగ్గింది. ఈ విధంగా నైపుణ్యం కలిగిన శ్రామికశక్తితో భారతదేశం ప్రపంచంలోని అత్యంత కీలకమైన ఉత్పత్తి, ఎగుమతి ఆర్థిక వ్యవస్థలలో ఒకటిగా అవతరించింది. పెరుగుతున్న విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు, విస్తరిస్తున్న పారిశ్రామిక సామర్థ్యంతో 2025 సంవత్సరంలో భారత్ వేగంగా అభివృద్ధి చెందుతున్న మార్కెట్గానూ, ప్రధాన ప్రపంచ ఉత్పాదక కేంద్రంగానూ మారింది.

======================

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమర్ధవంతమైన పాలనలో ఈ ఏడాది అద్భుతమైన ఫలితాలు రాబట్టగలిగామని ఇరవై సూత్రాల కార్యక్రమాల అమలు ఛైర్మన్ లంకా దినకర్ తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన ఈరోజు మాట్లాడుతూ... ప్రభుత్వం ఆమోదం తెలిపిన 8.55 లక్షల కోట్ల రూపాయిల పెట్టుబడుల ద్వారా 8.23 లక్షల ఉద్యోగాల కల్పన జరుగుతుందన్నారు. విశాఖపట్టణం సిఐఐ సదస్సు ద్వారా 13.25 లక్షల కోట్ల రూపాయిల ఒప్పందాలు జరిగాయని, వీటి ద్వారా 16.13 లక్షల మంది యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. అమరావతిలో రాజధాని పనుల వేగవంతమయ్యాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం 15

వేల కోట్ల రూపాయల ఆర్థిక సహాయం అందించిందని, ఓఆర్ఆర్ నిర్మాణం, బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థల నిర్మాణాలకు శంఖుస్థాపనలు జరిగాయని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం 2025లో చేపట్టిన సంస్కరణలు కూడా సానుకూల ఫలితాలు ఇస్తున్నాయని లంకా దినకర్ వెల్లడిస్తూ…

(వాయిస్ 30 సెకన్లు)

======================

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం వీబీ-జీ-రామ్-జీ చట్టాన్ని తీసుకువచ్చిందని భారతీయ జనతా పార్టీ (బీజేపీ) రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ తెలిపారు. ఈ నూతన చట్టం ప్రకారం గతంలో ఉన్న 100 రోజుల పని దినాలను ప్రభుత్వం 125 రోజులకు పెంచిందని, దీనివల్ల శ్రామికుల వార్షిక ఆదాయం నేరుగా 25 శాతం పెరుగుతుందన్నారు. గతంలో కేవలం గుంతలు తీయడానికే పరిమితమైన ఈ పథకం ద్వారా ఇప్పుడు చెరువుల పునరుద్ధరణ, రోడ్లు, గిడ్డంగుల నిర్మాణం వంటి శాశ్వత ఆస్తుల నిర్మాణంపై దృష్టి పెట్టనున్నారని చెప్పారు. పంటల సాగు, కోతల సమయంలో శ్రామికుల కొరత రాకుండా ఉండేందుకు ఏటా 60 రోజుల విరామం ఇచ్చే వెసులుబాటుని రాష్ట్రాలకు కల్పించిందని తెలియజేశారు. ఈ పథకంపై అవగాహన కల్పించేందుకు బీజేపీ రాష్ట్ర వ్యాప్తంగా కార్యక్రమాలు చేపట్టనుందని పివిఎన్ మాధవ్ ఒక పత్రికా ప్రకటనలో వెల్లడించారు.

======================

రాష్ట్రంలోని దేవాలయాల్లో తప్పులు జరిగితే ఉపేక్షించబోమని, ఎంతటివారైనా కఠిన చర్యలు తీసుకుంటామని దేవదాయ, ధర్మధాయ శాఖా మంత్రి ఆనం రాంనారాయణ రెడ్డి హెచ్చరించారు. రాష్ట్రంలోని పలు దేవాలయాల్లో ఇటీవల చోటు చేసుకున్న ఘటనలపై ఆత్మకూరులో ఆయన ఈరోజు పాత్రికేయులతో మాట్లాడారు. ఘటనలపై వెంటనే స్పందించి తగిన చర్యలు చేపట్టామని, పూర్తి స్థాయిలో విచారించి చర్యలు తీసుకున్నామని వెల్లడించారు.

======================
======================